క్లుప్తంగా

25 నుంచి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

బిక్కవోలు: క్యూఆర్ కోడ్‌తో కూడిన స్మార్ట్ రేషన్ కార్డులని ఈ నెల 25 నుంచి పంపిణీ చేస్తున్నట్టు తహసీల్దార్ బీఎస్ వీవీ కృష్ణ తెలిపారు. ఆదివారం ఆయన డీలర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ముందుగా 65 సంవత్సరాలు పై బడిన వృద్ధులకు ఇంటింటికీ రేషన్ పంపిణీతో పాటు స్మార్ట్ కార్డుల అందజేయాలన్నారు. మిగిలిన కార్డుదారులందరూ గ్రామ సచివాలయం ఉద్యోగుల ద్వారా కార్డుదారుల కుటుంబాలకు రేషన్ దుకాణాల వద్ద వాటిని ఉచితంగా అందించాలన్నారు. స్మార్ట్ కార్డులో రాజముద్రతో పాటు కుటుంబ సభ్యుల వివరాలు క్యూఆర్ కోడ్ ఉంటుందన్నారు. మండలంలోని 22,309 కార్డు అందించాలన్నారు. లబ్దిదారులు ఈ నెల తప్పకుండా స్మార్ట్ కార్డు తీసుకుని వారికి కేటాయించిన రేషన్ షాపు వద్ద బియ్యం తీసుకోవాలని ఆయన తెలిపారు.

సూర్యదేవునికి పూజలు



ప్రత్యేక అలంకరణలో సూర్యదేవుడు, దేవరులు

పెదపూడి: జి.మామిడాడలో ప్రసిద్ధి చెందిన ఉషా, ఛాయ, పద్మిని, సొంజ్ఞ సమేత సూర్య దేవుని ఆలయంలో ఆదివారం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు రేజేటి వెంకటనరసింహాచార్యులు ఆధ్వర్యంలో రుత్వికులు స్వామివారికి పంచామృతాభిషేకాలు, వ్రత పూజలు నిర్వహించారు. విశేష సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు ఆలయ కమిటీవారు, తీర్థ ప్రసాదాలు, అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

యథేచ్ఛగా పందుల సంచారం



రంగంపేటలోని ఒక వీధిలో సంచరిస్తున్న పందులు

రంగంపేట: గ్రామంలోని పలు వీధుల్లో పందులు యథేచ్ఛగా సంచరిస్తున్నాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీధుల్లో తిరుగుతూ పలువురిపై దాడి చేస్తున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. అధికారులు స్పందించి పందుల బెడదను నివారించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పంట నమోదు తప్పనిసరి

రంగంపేట: రైతులందరూ పంట వివరాలు తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి కె.శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ పంట వేసిన ప్రతి రైతు ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో వీఏఏలను కలసి పంట నమోదు చేయించుకోవాలన్నారు. ఇంకా ఎవరికైనా అన్నదాత సుఖీభవ పథకం ద్వారా లబ్ధి పొందకపోతే రైతు సేవా కేంద్రంలో గ్రీవెన్స్‌లో నమోదు చేసుకోవడానికి ఈనెల 25వ తేదీ వరకు గడువు ఉందని ఈలోపు నమోదు చేసు వచ్చునన్నారు. ఎన్‌పీసీఐ ఇక్ యాక్టివ్ జాబితాలో ఉన్న రైతులు వారికి సంబంధించిన బ్యాంక్‌కి ఎన్‌పీసీఐ ఆక్టివ్ చేయించుకోవాలని తెలిపారు. లేదా భారత తపాలా కేంద్రాల్లో అకౌంట్ ఓపెన్ చేయించుకుంటే అన్నదాత సుఖీభవ సొమ్ము పడుతుందని చెప్పారు.

రేపు రక్తదాన శిబిరం

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరం మదర్ థెరిస్సా సెంటర్‌లో మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్టు వైఎస్సార్ సీపీ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు, మదర్ థెరిస్సా సేవ సమితి వ్యవస్థాపకులు పెదపాటి రమేష్‌బాబు(డాక్టర్‌బాబు) ఆదివారం తెలిపారు. ఈనెల 26న మదర్ థెరిస్సా పుట్టిన రోజు సందర్భంగా ఉచిత రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నామని తెలిపారు. సేవాసమితి సభ్యులు, అభిమానులు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు.

కానిస్టేబుళ్లుగా ఎంపికైన హోంగార్డులకు అభినందనలు



హోంగార్డులను అభినందిస్తున్న ఎస్పీ నరసింహకిశోర్

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): జిల్లాలో హోంగార్డులుగా విధులు నిర్వర్తిస్తూ కానిస్టేబుళ్లుగా ఎంపికైన నలుగురిని జిల్లా ఎస్పీ డి.నరసింహకిశోర్ ఆదివారం అభినందించారు. జిల్లా పోలీసు శాఖలో హోంగార్డులుగా పని చేస్తూ ఇటీవల రాష్ట్ర స్థాయి పోలీసు నియామక మండలి వెల్లడించిన ఫలితాల్లో సివిల్ కానిస్టేబుళ్లుగా జిల్లాకు చెందిన నలుగురు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీమాట్లాడుతూ పోలీసుశాఖపై అవగాహన, అనుభవంతో మరింత ఉన్నతంగా సేవలందించాలన్నారు. క్రమశిక్షణ, నిజాయతీతో పని చేసి, పోలీసు శాఖకు మంచి పేరు తేవాలని, విధుల్లో నిబద్ధతతో పని చేసి, ప్రజలకు సేవలందించాలన్నారు

పాడి వృద్ధికి ప్రాధాన్యం

- పశు సంపదతో అదనపు ఆదాయం
- పశువుల రక్షణపై ప్రత్యేక దృష్టి
- అవగాహన కల్పిస్తున్న పశువైద్య అధికారులు

రాజానగరం: అన్నదాతకు వ్యవసాయంతోపాటు పాడి కూడా ఎంతో అవసరం. పశు సంపదతో అదనపు ఆదాయాన్ని సమకూరుస్తూ ఆర్థికంగా చేదోడుగా నిలుస్తుంది. అందుకనే పశు సంపద పోషణపై రైతులు ప్రత్యేక శ్రద్ధను చూపిస్తుంటారు. పాడి వృద్ధికి అవసరమైన ఆహారాన్ని (ఎండు గడ్డి, పచ్చి గడ్డి, తవుడు, ముస్నగున్నవి) అందిస్తూ, రాత్రి సమయాల్లో వాటికి దోమల బెడద లేకుండా సాయంత్రం వేళలలో పొగ వేయడం, దోమ తెరలు కట్టడం, ఫ్యాన్లు పెట్టడం వంటివి కూడా చేస్తుంటారు. ఈ క్రమంలో పాడి పశువులతోపాటు ఇతర పశు సంపద ఆరోగ్యంపై కూడా శ్రద్ధ తీసుకోవలసిన అవసరం ఉంది. ముఖ్యంగా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా నివారణా చర్యలు తీసుకోవడం ఎంతో అవసరమని మండల పశువైద్యాధికారి, సహాయ సంచాలకులు డాక్టర్ ఎంఎస్‌ఎస్ మూర్తి అంటున్నారు. ఈ విషయమై రైతులకు గ్రామాలకు వెళ్లి అవగాహన కలిగిస్తున్నామన్నారు.

మాంసకృత్తులు ఎంతో అవసరం

పశువుల ఎదుగుదలకు, రోగ నిరోధక శక్తి పెరుగుదలకు మాంసకృత్తులు ఎంతో అవసరం. పెయ్యి దూడల ఎదుగుదలకు, పాడి పశువులలో పాల దిగుబడికి తోడ్పడతాయి. మాంసకృత్తులు లోపిస్తే అనారోగ్యాల బారిన పడి, ఎదుగుదల ఆగిపోయి బక్క చిక్కిపోతుంటాయి. అలా వాటిలో అండాశయం చిన్నగా ఉండడం, ఆలస్యంగా యుక్త వయస్సుకు రావడం, వ్యాధి నిరోధక శక్తి తగ్గడం, కండరాల బలహీనత వంటి సమస్యలు ఎదురవుతాయి. పత్తి గింజలు, కొబ్బరి పిండి, వేరుశెనగ పిండి, నువ్వుల పిండి, చేపల పొడి వంటి వాటిలో విటమిన్లు సమృద్ధిగా లభిస్తాయి.

పశువుల శరీరంలో కొవ్వు నిల్వలు అంతర్గత అవయవాలను గాయాల నుంచి కాపాడతాయి. శరీర ఉష్ణోగ్రతను క్రమబద్ధీకరిస్తాయి. ఆహారంలో రుచిని పెంపొందిస్తాయి. కొవ్వు, పిండి పదార్థాల కంటే రెండున్నర రెట్లు అధిక శక్తినిస్తాయి. వేరుశెనగ పిండి, కొబ్బరి పిండి, నూనె గింజల చెక్క, గోధుమ తవుడు, వరి తవుడులో కొవ్వు పదార్థాలు అధికంగా ఉంటాయి.



పచ్చిక బయళ్లలో మేత మేస్తున్న పశువులు



సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్న వైద్యులు

నీరు ఎంతో ముఖ్యం

పశువులకు తాగునీరు సమృద్ధిగా అందుబాటులో ఉండాలి. రోజుకు 50 లీటర్ల వరకు నీరు అవసరం ఉంటుంది. సాధారణంగా నీరు లేకుండా ఐదు రోజులకు మించి ఉండలేవు. శరీర జీవన ప్రక్రియకు, ఉత్పాదకతకు నీరు అవసరం ఉంటుంది. ఆహారంలోని వివిధ పోషక పదార్థాలను సంగ్రహించడానికి పోషక పదార్థాలు, విటమిన్లు, ఖనిజ లవణాలు శరీరంలోని వివిధ భాగాలకు చేర్చడానికి, శరీర ఉష్ణోగ్రతను క్రమబద్ధీకరించడానికి, శ్వాస ప్రక్రియ సజావుగా జరగడానికి, చర్మం సాగే గుణం కలిగివుండటానికి, జీర్ణక్రియలో ఉపయోగపడే కొన్ని ఎంజైములు తయారీకి, వ్యర్థ పదార్థాల విసర్జన క్రియకు నీరు తోడ్పడుతుంది. శరీరంలో నీరు తక్కువైతే చర్మం పొడిగా మారడం, మూత్ర సంబంధ వ్యాధులు, అజీర్తి, మలబద్ధకం మున్నగు సమస్యలు ఎదురవుతాయి.

పాడి పరిశ్రమతో ఆదాయం

రైతులకు వ్యవసాయం తరువాత కాస్తో కూస్తో ఆదాయాన్ని అందించేది పాడి పరిశ్రమే. పాడి సమృద్ధిగా ఉంటే ఆదాయం కూడా బాగుంటుంది. పాడి అభివృద్ధికి సరైన పోషణ ముఖ్యంగా పచ్చి, ఎండు గ్రాసంతోపాటు పత్తి గింజలు, కొబ్బరి పిండి, వేరుశెనగ పిండి, నువ్వుల పిండి, చేపల పొడి వంటివి అవసరం. వీటిలో విటమిన్లు సమృద్ధిగా ఉండడం వలన వ్యాధి నిరోధక శక్తి వృద్ధి చెందడానికి తోడ్పడతాయి. పశువులను భద్రంగా చూసుకోవాలి.

– డాక్టర్ ఎంఎస్ఎస్ మూర్తి, సహాయ సంచాలకులు, పశుసంవర్ధక శాఖ

క్రిస్టియన్ మైనారిటీ సెల్ అధ్యక్షులు వీరే



క్రిస్టియన్ మైనార్టీ అధ్యక్షులను ప్రకటిస్తున్న డాక్టర్ సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు సంబంధించిన వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనారిటీ సెల్ అధ్యక్షులను అనపర్తి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఆదివారం పార్టీ కార్యాలయంలో ప్రకటించారు. అనపర్తి మండలానికి రెవరెండ్ ఆర్ ప్రేమ్‌కుమార్, బిక్కవోలు మండలానికి రెవ.టీవీవీ ప్రసాదరావు, రంగంపేట మండలానికి రెవ. కె.స్వర్ణన్‌రాజు, పెద్దపూడి మండలానికి రెవ. మొయ్యి సూర్యారావులను నియమించినట్టు తెలిపారు. వారికి నియామక పత్రాలను అందజేశారు. పార్టీకి ఆది నుంచి వెన్నుదన్నుగా ఉండి విజయానికి కృషి చేశారని ఇక పై కూడా పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూర్యనారాయణరెడ్డి అన్నారు. తమ పై నమ్మకంతో అప్పగించిన బాధ్యతను సంపూర్ణంగా నెరవేరుస్తామని నలుగురు అధ్యక్షులు ప్రతిజ్ఞ చేశారు.

నీరుగారుతున్న ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం

కోరుకొండ: ఫీజురీయింబర్స్‌మెంట్ పథకాన్ని అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని ఆమ్‌ఆద్మీ పార్టీ అధికార ప్రతినిధి కె.కృష్ణ మోహన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన విద్యార్థుల సంఖ్య విస్తృతంగా పెరగడానికి దోహదపడాల్సిన పథకాన్ని నీరుగారుస్తున్నారన్నారు. విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేస్తుందని తెలిపారు. కూటమి ప్రభుత్వం చిత్త శుద్ధితో వ్యవహరించకపోవడంతో పలు సమస్యలను ఎదుర్కొంటుందన్నారు. ఉన్నత విద్యను ఉచితంగా అందించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పది మంది జూదరుల అరెస్టు

కోరుకొండ: దోసకాయలపల్లి తోటల్లో పేకాట ఆడుతున్న 10 మందిని కోరుకొండ పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. స్థానిక వెంకన్నకు చెందిన తోటలో పేకాట శిబిరం నిర్వహిస్తున్నట్టు అందిన సమాచారం మేరకు ఎస్సై కేవీ నాగార్జున తన సిబ్బందితో వెళ్లి దాడి చేశారు. దాడిలో 10 మంది నిందితులను అరెస్టు చేసి, వారి నుంచి రూ.41,000 నగదు, 52 పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

భక్తుల మనోభావాలకు గౌరవం ఇవ్వండి

- అనపర్తి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి



అనపర్తి: రాజకీయ నిర్ణయాలతో నియోజకవర్గంలోని పలు దేవాలయల నిర్వాహణ, నిధులపై భక్తులకు పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వారి మనోభావాలకు గౌరవం ఇచ్చి వివరాలను ప్రకటించాలని అనపర్తి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ అనపర్తి బీజేపీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తీసుకుంటున్న వివాదాస్పద నిర్ణయాల వల్లే ఈ పరిస్థితి నెలకొందన్నారు. హిందూత్వ ఉద్ధరణే ప్రధాన లక్ష్యంగా ఉన్న బీజేపీ పార్టీలో ఎమ్మెల్యేగా ఉంటూ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా కొత్తూరు గ్రామంలో ప్రభుత్వ స్థలంలో గుడి నిర్మించారన్న సాకుతో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని పోలీసు బలగాలతో అడ్డుకున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి భక్తుల మనోభావాలను కించపరచారని ఆరోపించారు. కుతుకులూరు ఆంజనేయస్వామి ఆలయ నిధులపై కూడా భక్తులకు ఎన్నో అనుమానాలు ఉన్నాయని రూ.73 లక్షలకు సంబంధించిన వడ్డీ పై కూడా స్పష్టత లేదని స్థానికులు తన వద్ద గోడు వెళ్లబుచ్చుకున్నారని డాక్టర్ సూర్యనారాయణరెడ్డి అన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఆలయాల కమిటీల ఆర్థిక వ్యవహారాలల్లో ఎమ్మెల్యే జోక్యం చేసుకుంటున్నారన్నారు. ఆయన తీసుకుంటున్న నిర్ణయాలు పెద్ద ఎత్తున చర్చకు దారి తీస్తున్నాయని ఆలయ అభివృద్ధి కోసం ఉపయోగించాల్సిన నిధులపై ఎలాంటి లెక్కలు చూపకపోవడం తీవ్ర విమర్శలకు దారి తీస్తోందన్నారు. భక్తుల మనోభావాలను గౌరవించి ఇప్పటికైనా వాస్తవాలను బహిర్గతంగా ప్రజలకు తెలియజేయాలని డాక్టర్ సూర్యనారాయణరెడ్డి డిమాండ్ చేశారు.

మట్టిలో మాణిక్యం

- ఒకేసారి మూడు ఉద్యోగాలకు ఎంపిక
- ఓ పక్క విచారం.. మరో పక్క ఆనందం



గొలుగూరి సూర్య సాయి మణికంఠరెడ్డి

బిక్కవోలు: పందలపాక గ్రామానికి చెందిన గొలుగూరి సూర్యసాయి మణికంఠరెడ్డి మట్టిలో మాణిక్యం అని చెప్పు వచ్చు. ఇటీవల విడుదల అయిన డీఎస్సీలో స్కూల్ అసిస్టెంట్(సోషల్)11వ ర్యాంకు, టీజీటీ(సోషల్) 4వ ర్యాంకు, ఎస్‌జీటీలో 78వ ర్యాంకు సాధించారు. తన తండ్రి నాగిరెడ్డి కూలీ పని చేస్తూ తన కుమారుడు చదివించారు. 2015 డీఎడ్ పూర్తి చేశారు. 2019లో తొలిసారి డీఎస్సీలో ప్రయత్నం చేశాడు. కేవలం దగ్గరి వరకు వచ్చి విఫలమయ్యాడు. కానీ ఓటమి ఆ యువకుడికి మనసును బలహీన పరచలేదు. వలంటీర్లుగా సేవలు అందించారు. 2021లో బీఈడీ సీటు రావడంతో మళ్లీ చదువుపై దృషి పెట్టి 23లో బీఈడీ పూర్తి చేశారు. అప్పటి నుంచి తాత్కాలిక ఓటమి శాశ్వత విజయానికి పునాది అని నిరూపించాడు. ప్రభుత్వం విడుదల చేసిన జనరల్ మెరిట్ లిస్టు ప్రకారం మూడు ఉద్యోగులు సాధించారు. ఈ సందర్భంగా మణి కంఠ మాట్లాడుతూ తన తండ్రి ఆస్తి లేకపోయిన పర్వావలేదు. చదువు ఉంటే ఆస్తి ఆదే వస్తుందని నమ్మకం ఉంచేవారు. అలాగే ఓసీలకు మన ఉద్యోగాలు వస్తాయని ఎవరు చెప్పిన వారి మాట పంటించుకోనేవారు కాదు. కష్టం పడితే అదే వస్తుందని నమ్మకంతో నన్ను చదివించాడు. అయితే ఈ నెల 18న తండ్రి నాగిరెడ్డి మృతి చెందాడు. నేను మూడు ఉద్యోగాలు సాధించాని ఆ విషయం చెప్పడానికి ఆనందించాడానికి తన తండ్రి లేరు అని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి విజయం సాధించిన మణికంఠ పలువురు ఆదర్శం నిలిచారని పలువురు అభినందించారు.

భవన నిర్మాణం ప్రకారమే ఆస్తి పన్ను

- జిల్లా కలెక్టర్, ఇన్‌చార్జి కమిషనర్ ప్రశాంతి



క్షేత్ర స్థాయిలో భవనాలను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ: నగరంలో ప్రతి ఇంటికీ ఆస్తి పన్ను విధిగా ఉండాలని, భవన నిర్మాణం అనుమతి ప్రకారం మాత్రమే నిర్మాణాలు ఉండాలని జిల్లా కలెక్టర్, ఇన్‌చార్జి కమిషనర్ పి.ప్రశాంతి అన్నారు. ఆదివారం నగరంలో విద్యానగర్, వీవర్స్ కాలనీ, తాడితోటలోని కరుణ శ్రీ ఆస్పత్రి, జేఎన్ రోడ్డులోని సాల్ట్ హాస్పిటల్, ఏవీఏ రోడ్డులోని పాంటలూన్స్ సహా పలు భవనాలను ఆమె పరిశీలించారు. ఆమోదం పొందిన ప్లానింగ్‌కు అనుగుణంగా నిర్మాణాలు చేపట్టాలని, ఏమైనా వ్యత్యాసం ఉన్నట్టయితే తగు చర్యలు తీసుకోవాలని టౌన్ ప్లానింగ్ అధికారులకు సూచించారు. అలాగే సచివాలయ పరిపాలన కార్యదర్శులు ఉదయం 8 గంటల నుంచి ఫీల్డ్ లోకి వెళ్లి అండర్ అసెస్మెంట్, అన్ అసెస్మెంట్, ఖాళీ స్థలాలను గుర్తించి పన్ను విధించాలని ఆదేశించారు. కలెక్టర్ పర్యటన నేపథ్యంలో సచివాలయ అడ్మిన్ ఇందుకు పూర్తి బాధ్యత అడ్మిన్ సెక్రటరీలు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు వహించాల్సి ఉంటుందన్నారు. అలాగే సచివాలయాల వారీగా క్షేత్ర స్థాయిలో అనుమతులను అనుసరించి చేపడుతున్న నిర్మాణాల పురోగతిపై రోజు వారి నివేదికలను అందించాలని ఆదేశించారు. గృహాలు, వాణిజ్య సముదాయాలకు ఇచ్చిన అనుమతులు, అక్కడి నిర్మాణాలు, వాటికి సంబంధించి పన్నులు హేతుబద్ధత విధానంలో ఉన్నాయో లేదా కూడా కచ్చితంగా పరిశీలన చేయాలన్నారు. కలెక్టర్ వెంట అదనపు కమిషనర్ పీవీ రామలింగేశ్వర్, డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకటరమణ, రెవెన్యూ అధికారి సీహెచ్ శ్రీనివాసరావు, ఇతర సిబ్బంది ఉన్నారు.

పనితీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవు

- జిల్లా కలెక్టర్ ఆగ్రహం
- ఏఈకి షోకాజ్ నోటీసులు



సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్‌ప్లాంట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ: సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్ వ్యవహారంతో అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్, నగర పాలక సంస్థ ఇన్‌చార్జ్ కమిషనర్ పి.ప్రశాంతి ఆగ్రహం వ్యక్తం చేసారు. ఆదివారం నగరంలో లూథర్‌గిరిలోని ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రాన్ని (సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ సెంటర్) ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్లాంట్ పనితీరుపై ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ క్షేత్ర స్థాయిలో వ్యర్థాల సేకరణ, శుద్ధి, రీసైక్లింగ్, కంపోస్టింగ్ పనుల అమలు పరిస్థితిని పరిశీలించారు. హెల్త్ అధికారుల నుంచి ప్రాసెస్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నివారణ, వ్యర్థాలను వనరులుగా మార్చడంలో సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందని కలెక్టర్ పి.ప్రశాంతి స్పష్టం చేశారు. రాజమహేంద్రవరాన్ని స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రజల్లో చైతన్యం పెంపొందించేందుకు అవసరమైన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఇంటి వద్ద చెత్త వేరు చేసి అందించడం ప్రతి ఒక్కరూ వ్యక్తిగత బాధ్యతగా భావించాలన్నారు. అయితే నగరంలో రోజుకు 160 టన్నుల చెత్త ఉత్పన్నం అవుతున్నా తడి, పొడి చెత్త వేరు చేసే ప్రక్రియ సక్రమంగా జరగకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టర్ క్షేత్ర స్థాయి పర్యటన నేపథ్యంలో ఏఈ గైర్హాజరీపై తీవ్రంగా స్పందించి షోకాజ్ నోటీసులు ఇవ్వాలని ఆదేశించారు. విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తే ఏ స్థాయి అధికారి అయినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ పీవీ రామలింగేశ్వర్‌రావు, డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకట రమణ, ఎస్ఈ ఎంసీహెచ్ కోటేశ్వరరావు, ఈఈ రీటా, డీఈ కె.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

సీతానగరం: కాటవరానికి చెందిన యర్రబోయిన లక్ష్మిని కొట్టిన సంఘటపై వచ్చిన ఫిర్యాదు మేరకు నేలం శ్రీను, నేలం వరలక్ష్మిలపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై డి.రామ్ కుమార్ ఆదివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని శ్రీను, వరలక్ష్మి ఇంటికి వచ్చిన ఓ వ్యక్తి మీరు సారా అమ్ముతున్నారని పోలీసులకు సమాచారం ఇస్తున్నారని చెప్పారు. ఆ సమాచారం లక్ష్మి ఇస్తుందని భావించిన శ్రీను, వరలక్ష్మి అక్కడే ఉన్న లక్ష్మి ఇంటికి వెళ్లి గొడవ పడ్డారు. సారా అమ్ముతున్నట్టు మాపై సమాచారం ఇస్తున్నావని, చంపుతామని భయపెట్టి, చేతులతో కొట్టినట్టు శనివారం లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

సేవలు మరింత విస్తృతం చేసేందుకు ప్రణాళికలు

- భారత్ వికాస్ పరిషత్ రీజినల్ ఫైనాన్స్ సెక్రటరీ (సౌత్) రాజగోపాల పాయ్
- విశాఖ ప్రాంత్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

రాజమహేంద్రవరం సిటీ: క్షేత్ర స్థాయిలో భారత్ వికాస్ పరిషత్ సేవలు మరింతగా విస్తృతం చేసేందుకు నూతన కార్యవర్గం నిర్మాణాత్మకమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని భారత్ వికాస్ పరిషత్ రీజినల్ ఫైనాన్స్ సెక్రటరీ (సౌత్) రాజగోపాల పాయ్ పిలుపు నిచ్చారు. స్థానిక హోటల్ సూర్యలో రాష్ట్ర స్థాయి (విశాఖ ప్రాంత్) నూతన కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవంగా నిర్వహించారు. ఏడాది కాలం రాష్ట్ర స్థాయిలో కొనసాగే కార్యవర్గం రాష్ట్ర (విశాఖ ప్రాంత్) అధ్యక్షుడిగా జి.బి.వి.సుబ్రహ్మణ్యం, కార్యదర్శిగా పీవీఎస్. నారాయణ, కోశాధికారిగా తాడోజు సాయి కృష్ణతో ప్రమాణ స్వీకారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ, భారత్ వికాష్ పరిషత్ శాఖల విస్తరణ, పని విస్తరణ, కార్యవిక్తార్, కార్యకర్త విక్తార్‌లపై దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ జనరల్ సెక్రటరీ సీహెచ్ మురళీధర్ సౌత్ రీజినల్ టీం జనరల్ సెక్రటరీ డి.పురుషోత్తమ శాస్త్రి, సౌత్ రీజినల్ టీం, మహిళా బాల వికాస్ డాక్టర్ బి.అనురాధ పాల్గొన్నారు. రాజమహేంద్రవరం, కొవ్వూరు, తుని, విశాఖ శాఖల నుంచి అధ్యక్షుడు కార్యదర్శులు, కోశాధికారులు, సభ్యులు పాల్గొన్నారు.

ఖాళీ స్థలాలు.. వ్యాధులకు వేదికలు

- నిర్వహణ పట్టించుకోని స్థల యజమానులు
- దోమలు, పాములు, పందులకు ఆవాసాలు
- ఇబ్బంది పడుతున్న స్థానికులు



చంద్రేడులో నివాసాల మధ్య తుప్పలతో నిండి ఉన్న ఖాళీ స్థలం

రంగంపేట: గ్రామాల్లో ఖాళీ స్థలాల నిర్వహణ లేకపోవడంతో చెత్త పేరుకుపోతోంది. ఆ చుట్టు పక్కల వారు చెత్త, వ్యర్థాలను తీసుకొచ్చి ఖాళీ స్థలంలో పడేస్తున్నారు. అందులోనూ ఇది వర్షా కాలం కావడంతో చెత్తకు తోడు వర్షపు నీరు నిలిచిపోవడం దుర్వాసన వెదజల్లుతోంది. దీనివల్ల స్థానికులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు.

మండలంలోని 17 గ్రామ పంచాయతీల పరిధిలో ఉన్న గ్రామాల్లో నివాసాల ప్రక్కనే ఉన్న ఖాళీ స్థలాలు చిన్నపాటి అడవులను తలపిస్తున్నాయి. పిచ్చి మొక్కలు భారీగా పెరిగిపోయి దోమలు, విష సర్పాలకు ఆవాససాలుగా మారుతున్నాయి. ప్రతి గ్రామంలోను కొందరు ఖాళీ స్థలాలు కొనుగోలు చేసి వదిలేస్తున్నారు. నిర్వహణ లేకపోవడంతో మొక్కలు పెరిగిపోయి వర్షపు నీరు, మురుగు నీరు చేరి దోమలు, పందులకు ఆవాసాలుగా మారుతున్నాయి. దీంతో పరిసర ప్రాంతాల్లో నివాసముంటున్న వారు విష జ్వరాల బారిన పడుతున్నారు.

పట్టించుకోని యజమానులు

స్థలాల యజమానులు అధిక ధరలు వస్తే లాభానికి అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. అంత వరకు స్థలాలు ఖాళీగా వదిలేస్తున్నారు. పిచ్చి మొక్కలు తొలగించాలని చుట్టు పక్కల వారు చెప్పినా కనీసం పట్టించుకోవడం లేదని ఇరుగుపొరుగువారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు నీరు చేరి తీవ్ర దుర్వాసన వెదజల్లడంతో పాటు సాయంత్రం దోమల బెడద ఎక్కువవుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఖాళీ స్థలాలను మట్టి వేసి ఎత్తు చేసేలా యజమానులకు సూచించాలని, పిచ్చి మొక్కల్ని ఎప్పటికప్పుడు తొలగించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



ఖాళీగా ఉన్న స్థలంలో ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు

మట్టి వినాయక ప్రతిమల పంపిణీ

రాజమహేంద్రవరం రూరల్: పర్యావరణ పరిరక్షణలో భాగంగా మోరంపూడి జంక్షన్‌లో సత్య చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం ఉచితంగా మట్టి వినాయక విగ్రహాలను, వినాయక వ్రత కల్ప పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సత్యచారిటబుల్ ట్రస్టు అధ్యక్ష, కార్యదర్శులు తమ్మారవి, ఉపాధ్యాయుల శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ ట్రస్టు ద్వారా ప్రతి ఏడాది పర్యావరణ పరిరక్షణకు మట్టివినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సత్య చారిటబుల్ ట్రస్టు సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.